# కెనరా బ్యాంక్ లాభం 3,757 కోట్లు

## క్యూ4లో 18 శాతం పెరిగిన ప్రాఫిట్

న్యూఢిల్లీ, మే 8: కెనరా బ్యాంక్ అంచనాలకుమించి రాణించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.3,757 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.3,175 కోట్లతో పోలిస్తే 18 శాతం అధికం. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.28,807 కోట్లకు ఎగబాకింది.

- రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.16.10 డివిడెండ్‌ను ప్రకటించింది.
- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 5.35 శాతం నుంచి 4.23 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ 1.73 శాతం నుంచి 1.27 శాతానికి తగ్గాయి.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.2,280 కోట్ల నిధులను వెచ్చించింది.
- 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను బ్యాంక్ రూ.14,554 కోట్ల నికర లాభాన్ని గడించింది.



*ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి స్థూల నిరర్థక ఆస్తుల విలువను 3.25 శాతానికి, నికర ఎన్‌పీఏను ఒక్క శాతానికి తగ్గిస్తాం. ఈ ఏడాది అడ్వాన్స్‌లు 11-12 శాతం, డిపాజిట్లలో 9 శాతం వృద్ధి నమోదు చేసుకోనున్నది. ప్రస్తుతం నిధులు సేకరించే ఆలోచనేది బ్యాంక్‌కు లేదని, బ్యాంక్ వద్ద పుష్కలంగా నిధులు ఉన్నాయి. అధిక వడ్డీరేట్ల కారణంగా ఈ ఏడాది నికర వడ్డీ మార్జిన్ 2.95-3 శాతంగా ఉండనున్నది. ఇప్పటి వరకు బ్యాంక్ రూ.1.10 లక్షల కోట్ల రుణాలు మంజూరు చేసింది.*

**- కే సత్యనారాయణ రాజు, కెనరా బ్యాంక్ ఎండీ, సీఈవో**

# హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ డాటా సెంటర్

## రూ.267 కోట్లతో భూమిని కొనుగోలు చేసిన సంస్థ

హైదరాబాద్, మే 8:అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్..హైదరాబాద్‌లో డాటా సెంటర్‌ను నెలకొల్పడానికి సిద్ధమైంది. ఇందుకోసం 48 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలుస్తున్నది. ఒప్పందం విలువ రూ.267 కోట్లని పేర్కొంది. హైదరాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలో రంగారెడ్డి జిల్లాలో సాయి బాలాజీ డెవలపర్ల వద్ద ఈ భూమిని కొనుగోలు చేసింది. భారత్‌లో డాటా సెంటర్ వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అతిపెద్ద డాటా సెంటర్‌ను నెలకొల్పడానికి ఈ భూమిని కొనుగోలు చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం సంస్థకు భారత్‌లో పుణె, ముంబై, చెన్నైలలో మాత్రమే డాటా సెంటర్లు ఉండగా..తాజాగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నది నాలుగోది కావడం విశేషం. ఇప్పటికే హైదరాబాద్‌లో సంస్థకు ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్(ఐడీసీ)ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

# పెరగనున్న ఆరోగ్య బీమా ప్రీమియం!

## 15 శాతం వరకు పెంచేయోచనలో సంస్థలు: లోకల్‌సర్కిల్ సర్వేలో వెల్లడి




న్యూఢిల్లీ, మే 8: ఆరోగ్య బీమా పాలసీలు తీసుకున్నవారికి షాకివ్వబోతున్నాయి బీమా రంగ సంస్థలు. గడిచిన ఏడాదిగా ప్రీమియం చార్జీలను 50 శాతం వరకు పెంచిన సంస్థలు..మరోదఫా పెంచడానికి సిద్ధమవుతున్నాయి. బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ నిర్ణయంతో ప్రీమియం చార్జీలు పెంచకతప్పడం లేదని ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ప్రీమియం 25 శాతం నుంచి 50 శాతం వరకు పెరగగా..వచ్చే కొన్ని నెలల్లో మరో 10 శాతం నుంచి 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉన్నాయని లోకల్‌సర్కిల్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఈ సర్వేలో 11 వేల మంది పాల్గొన్నారు. వీరిలో 21 శాతం మంది ప్రీమియం 50 శాతం వరకు పెరిగినట్లు వెల్లడించగా..31 శాతం మంది 25-50 శాతం వరకు పెరిగాయని తెలిపారు. ప్రీమియం అధికమవడంతో సామాన్యులు ఆరోగ్య పాలసీ తీసుకోవడానికి జంకుతున్నారు. 2022లో 62 శాతంగా ఉన్న పాలసీదారులు ఆ తర్వాతి ఏడాదిలో 52 శాతానికి తగ్గారు. మరోవైపు, గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్య బీమా రంగం రికార్డు స్థాయిలో లక్ష కోట్ల రూపాయలను ఆర్జించింది. వార్షిక వృద్ధిరేటు 20 శాతంగా ఉన్నది.

# నగదు రుణం 20వేలే

## ఎవ్వరికీ అంతకుమించి ఇవ్వరాదు • ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్బీఐ ఆదేశం

న్యూఢిల్లీ, మే 8: దేశాన్ని డిజిటలైజేషన్ దిశగా నడిపించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మరో నిర్ణయం తీసుకున్నది. నగదు రూపేణా రూ.20,000కు మించి ఎవ్వరికీ రుణాలనూ ఇవ్వరాదని బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లకు ఆర్బీఐ స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ లేఖను సెంట్రల్ బ్యాంక్ విడుదల చేసినట్టు ప్రముఖ వార్తా ఏజెన్సీ రాయిటర్స్, ఈ సమాచారం తెలిసిన అధికార వర్గాల్లో ఇద్దరు చెప్తున్నారు. 'ఆదాయ పన్ను (ఐటీ) చట్టం 1961లోని సెక్షన్ 269ఎస్ఎస్ ప్రకారం రూ.20,000కు మించి ఎవ్వరికీ నగదు రుణం ఇవ్వరాదన్న నిబంధనను తప్పక అమలు చేయాలి' అని సదరు లేఖలో ఎన్‌బీఎఫ్‌సీలకు రిజర్వ్ బ్యాంక్ గట్టిగా తెలియజేసింది.

### నగదు చలామణి కట్టడికే..

పాత పెద్ద నోట్ల (రూ.500, రూ.1,000) రద్దు నేపథ్యంలో ఏర్పడిన నగదు కొరత దృష్ట్యా డిజిటల్ ఎకానమీపై కేంద్ర ప్రభుత్వం నజర్ పెట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అన్నింటా ఆన్‌లైన్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చారు. అయినప్పటికీ ద్రవ్యవ్యవస్థలో మళ్లీ నగదు చలామణి పెరిగింది. కరెన్సీల్లో లావాదేవీలు ఎప్పట్లాగే జరుగుతున్నాయి. దీంతో నగదు చలామణి కట్టడికి నిబంధనల్ని గట్టిగా అమలు చేయాలని ఆర్బీఐ నిర్ణయించుకున్నదని, అందులోభాగంగానే ఎన్‌బీఎఫ్‌సీల ద్వారా నగదు రుణాలు రూ.20,000కే పరిమితం చేసిందని అంటున్నారు. ఇదిలావుంటే రుణాల మంజూరులో ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌లో భారీ అవకతవకల్ని ఆర్బీఐ గుర్తించిన విషయం విదితమే. బంగారం నాణ్యతను గుర్తించడంలో, తూకంలో, నగదు రుణాల పరిమితిలో నిబంధనల్ని సంస్థ అస్సలు పట్టించుకోలేదని తేలింది. కస్టమర్ అకౌంట్ చార్జీల్లోనూ పారదర్శకత లోపించిందన్న ఆర్బీఐ.. కొత్త కస్టమర్లకు బంగారం తాకట్టుపై రుణాలను ఇవ్వరాదని ఆ సంస్థను ఆదేశించింది. ఈ పరిణామం కూడా ఎన్‌బీఎఫ్‌సీలపై తాజా ఆదేశాలకు కారణమేనన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అలాగే కరోనా తర్వాత భారీగా పెరిగిన రిటైల్ రుణాల దృష్ట్యా కూడా ఆర్బీఐ ఈ చర్యలకు దిగి ఉండవచ్చన్న వార్తలు వస్తున్నాయి.




### బీవోబీ వరల్డ్‌పై ఆంక్షలు ఎత్తివేత

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) డిజిటల్ యాప్ 'బీవోబీ వరల్డ్'పై గతంలో విధించిన ఆంక్షలను ఆర్బీఐ ఎత్తివేసింది. పర్యవేక్షణ లోపాలను ఎత్తిచూపుతూ నిరుడు అక్టోబర్ 10న ఈ యాప్‌లోకి కొత్త ఖాతాదారుల రాకపై రిజర్వ్ బ్యాంక్ నిషేధం విధించిన విషయం తెలిసిందే. అయితే దీన్ని బుధవారం తొలగించింది. ఇక గత వారం బజాజ్ ఫైనాన్స్‌పైనున్న ఆంక్షలనూ ఆర్బీఐ తీసేసిన సంగతి విదితమే. ఈకామ్, ఇన్‌స్టా ఈఎంఐ కార్డ్‌ల ద్వారా రుణాలను మళ్లీ ఇచ్చుకోవచ్చని చెప్పింది. కాగా, నిబంధనల్ని ఉల్లంఘించిన కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లపైనా గతంలో ఆర్బీఐ కొరడా ఝుళిపించినది తెలిసిందే.

# తెలుగు రాష్ట్రాల్లో జియో దూకుడు

హైదరాబాద్, మే 8: దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో.. తెలుగు రాష్ట్రాల్లో కస్టమర్లను ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నది. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో మార్చి నెలలో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో 1.06 లక్షల మంది కస్టమర్లు జియో నెట్‌వర్క్‌ను ఎంచుకున్నారు. దీంతో జియో వినియోగదారుల సంఖ్య 3.27 కోట్లకు చేరుకున్నారు. మరోవైపు, తన పోటీ సంస్థయైన ఎయిర్‌టెల్ 97 వేల మంది జతవగా, ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్‌ను 15, 432 మంది ఎంచుకున్నారు. కానీ, వొడాఫోన్ ఐడియా మాత్రం 48, 690 మంది కస్టమర్లను కోల్పోయింది. అలాగే మార్చి నెలలో దేశవ్యాప్తంగా జియో కొత్తగా 21.43 లక్షల మంది చేరారు. దీంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 46.97 కోట్లకు చేరుకున్నారు.

# హీరో డివిడెండ్ రూ.40

న్యూఢిల్లీ, మే 8: ద్విచక్ర వాహన తయారీలో అగ్రగామి సంస్థయైన హీరో మోటోకార్ప్ లాభాల్లోనూ దూకుడును ప్రదర్శించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.943.46 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.810.8 కోట్ల లాభం కంటే 16.7 శాతం అధికం. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.8,434.28 కోట్ల నుంచి రూ.9,616.68 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. అలాగే నిర్వహణ ఖర్చులు కూడా రూ.7,508.94 కోట్ల నుంచి రూ.8,427.36 కోట్లకు పెరిగాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.37,788.62 కోట్ల ఆదాయంపై రూ.3,742.16 కోట్ల లాభాన్ని గడించింది. అలాగే రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.40 తుది డివిడెండ్‌ను ప్రకటించింది. వచ్చే పండుగ సీజన్‌లో పలు మాడళ్లను మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది.

# బ్యాంక్ ఉద్యోగులకు సుప్రీం షాక్

## వడ్డీ రహిత రుణాలపైనా పన్ను

న్యూఢిల్లీ, మే 8: బ్యాంక్ అధికారులకు అత్యున్నత న్యాయస్థానం షాకిచ్చింది. తమ తమ బ్యాంకుల ద్వారా పొందే వడ్డీ రహిత లేదా రాయితీ వడ్డీ రుణాలూ ఆదాయ పన్ను (ఐటీ) చట్టం నిబంధనలకు లోబడే ఉంటాయని సుప్రీం కోర్టు తాజాగా స్పష్టం చేసింది. బ్యాంక్ సిబ్బంది తీసుకునే సదరు రుణాలను 'పెర్క్విజిట్'తో పోల్చిన కోర్టు.. ఈ ప్రయోజనాన్ని అందరూ పొందుతారన్నది. కాబట్టి వీటికీ పన్నులు వర్తిస్తాయని పేర్కొన్నది. ఈ మేరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, దిపాంకర్ దత్తాలతో కూడిన డివిజన్ బెంచ్ తేల్చిచెప్పింది. ఈ క్రమంలోనే ఈ కేసులో ఐటీ చట్టం 1961లోని సెక్షన్ 17(2)(viii) లేదా ఐటీ చట్టం 1962లోని రూల్ 3(7)(i)లను సమర్థిస్తూ అఖిల భారత బ్యాంక్ అధికారుల సమాఖ్య, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేసింది.

# కంపెనీలకు ప్లాస్టిక్ కష్టాలు

## కొత్త నిబంధనలతో పెరగనున్న ప్యాకేజింగ్ ఖర్చులు

## వినియోగదారులపై తప్పని భారం

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను వచ్చిన ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (పీడబ్ల్యూఎం) కొత్త నిబంధనలతో ప్యాకేజింగ్ ఖర్చులు ఇబ్బడిముబ్బడిగా పెరగనున్నాయి. రీసైక్లింగ్‌కు, భూమిలో తేలిగ్గా నశించిపోయేందుకు అనువుగా ఉన్న ప్లాస్టిక్‌ను మాత్రమే ఉపయోగించాలని కొత్త నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ నిబంధనలకు అనుగుణంగా ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగిస్తే ప్యాకేజింగ్ ఖర్చులు భారీగానే పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. వివిధ కంపెనీలు ప్యాకేజింగ్ కోసం ప్రస్తుతం సదరు ఉత్పాదక వ్యయంలో 5 నుంచి 13 శాతం వరకు ఖర్చు చేస్తుండగా, కొత్త నిబంధనలతో ఈ ఖర్చు మరో 3-4 శాతం వరకు పెరగవచ్చని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ భారం వినియోగదారులపైనే పడుతుందని వారు అంటుండటం గమనార్హం. దీంతో ఆయా రకాల ఉత్పత్తుల ధరలు మార్కెట్‌లో మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తున్నది. ఇదే జరిగితే తమ వ్యాపారంపై కొంత ప్రతికూల ప్రభావం చూపవచ్చని అటు వ్యాపారులు, ఇటు పరిశ్రమ ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నది.



### పర్యావరణం కోసం..

ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగం ఏటేటా గణనీయంగా పెరుగుతున్న విషయం తెలిసిందే. దీనివల్ల పర్యావరణానికి ఎంతో హాని కలుగుతున్నదని ప్రపంచ దేశాలు మొత్తుకుంటున్నా... దీని ఉత్పత్తి, వినియోగం మాత్రం తగ్గడం లేదు. ముఖ్యంగా ప్యాకేజింగ్ కోసం ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా అనేక రకాల ఉత్పత్తులు అందుబాటులోకి వస్తున్నప్పటికీ ప్లాస్టిక్‌కు డిమాండే ఉంటున్నది. 2000వ సంవత్సరంలో 234 మిలియన్ టన్నుల మేర ప్లాస్టిక్ ఉత్పత్తి అవగా, 2019 నాటికి ఇది 460 మిలియన్ టన్నులకు చేరుకున్నది. అయితే పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా ప్రపంచ దేశాలు ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని నిర్ణయించాయి. ఈ క్రమంలోనే మన దేశంలో పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ పీడబ్ల్యూఎం నిబంధనలను సవరించి ఈ ఆర్థిక సంవత్సరం నుంచి కఠినంగా అమలు చేయాలని సంకల్పించింది.









Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.